నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,6 ఆగస్టు 2024


## రైతులను ఆదుకుంటాం - ఎమ్మెల్యే నాయకర్



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** తుఫానుల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున అనుకుంటామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారంమండలంలోని చిట్టవరం,కొత్త నవరసపురం,సరిపల్లి, లిఖితపూడి, మల్లవరం, మల్లవరం లంక కొప్పర్రు గ్రామాల్లో అధిక వర్షాల వల్ల వరి పంటలు నష్టపోయిన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా 80శాతం సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలకు గ్రామ సర్పంచులు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతుల సక్షేమానికి కట్టుబడి ఉన్నదని రైతుకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, గంట కృష్ణ, మైల శివకుమార్,అగ్రికల్చర్ ఈడి సంబంధిత అధికారులు,రైతులు, జనసేన, తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్ల సదస్సులో వెట్రిసెల్వి,నాగరాణి





**ఏలూరు/భీమవరం,మేజర్న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం వెలగపూడి సచివాలయం 5వ బ్లాక్, రెండో అంతస్తులో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,,ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు .నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి కలెక్టర్ల సదస్సులో పాలనలో బాధ్యత, జవాబుదారీతనంపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం చేశారు. అదే విధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను విజయవంతంగా అమలుచేయడంపై సూచనలు చేశారు.100రోజుల ప్రణాళిక, 'పేదలసేవలో' కార్యక్రమం, జీరో పావర్టీ, ఈజ్ ఆఫ్ పబ్లిక్ సర్వీసెస్ తదితరాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశనం చేశారు. అదే విధంగా రాష్ట ప్రగతికి సమష్టిగా పనిచేద్దామంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సదస్సులో పేర్కొన్నారు.

## ఎస్ఐగా జయ బాబు నియామకం



**టి.నర్సాపురం,మేజర్ న్యూస్:** టి.నర్సాపురం నూతన ఎస్ఐగా జయ బాబు నియమితులయ్యారు.

## నాలుగేళ్ల చిన్నారి కిడ్నాప్ - దాడి - పాప సురక్షితం

- శరీరంపై గాయాలు - విజయవాడ ఆస్పత్రికి తరలింపు
- పోలీసులు అదుపులో ఒక వ్యక్తి?
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారథి ఆదేశం

**ఏలూరు,మేజర్ న్యూస్:** తల్లితండ్రుల మధ్య ఆదమర్చి నిద్రపోతున్న ముక్కు పచ్చలారని నాలుగేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి,దాడి చేసి అనంతరం నిందితుడు పారిపోయిన సంఘటన నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. ఈ సంఘటనపై రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర దిగ్రాంతి వ్యక్తం చేశారు. నిందితున్ని పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఏలూరు జిల్లానూజివీడు మండలం పల్లెలమూడి గ్రామంలో 4 సంవత్సరాల ముక్కుపచ్చలారని చిన్నారి తల్లిదండ్రుల మధ్యలో నిద్రపోతుంది. గుర్తుతెలియని వ్యక్తి చిన్నారిని అపహరించుకు పోయారు. అభం శుభం తెలియని చిన్నారిపై దాడి చేసి, కాళ్ళకు ఉన్న వెండి పట్టాలను తీసుకున్న అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వదిలి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన ఒక పెద్దాయన విగ్రహం వద్ద ఉన్న పాపను గుర్తించి తల్లిదండ్రులకు అప్పచెప్పారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి బాలికను వైద్య పరీక్షల కోసం నూజివీడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ వైద్యశాలకు తరలించారు.

**- మంత్రి సారధి దిగ్భ్రాంతి -** పల్లెర్లమూడి గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి బాలిక పై దాడి జరిగిన సంఘటన పట్ల రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబందాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తీవ్ర విచారం వ్యక్తం చేసారు. ఈ సంఘటనకి పాల్పడిన వ్యక్తిని తక్షణం అరెస్ట్ చేసి తీవ్రంగా శిక్షించాలని ఆయన జిల్లా యంత్రాంగాన్ని,పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు.

అవసరమైతే జాగిలాలను దింపి తక్షణం నిందితులను పట్టుకోవాలని మంత్రి ఆదేశించారు. సంఘటన జరిగిన విషయాన్ని తెసులుకొన్న వెంటనే అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అవసరమైన తక్షణ సహాయం అందించాలని మంత్రి ఏలూరు జిల్లా కలెక్టర్, ఏలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ను ఆదేశించారు. బాలికకు అవసరమైన వైద్యాన్ని తక్షణం అందించాలని అధికారులను ఆదేశించారు.

**- సంఘటన స్థలాన్ని సందర్శించిన ఆర్డిఓ -**

నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో చిన్నారి బాలికపై దాడి కి సంబంధించి ఘటనా స్థలాన్ని నూజివీడు రెవెన్యూ డివిజినల్ అధికారి భవాని శంకరి సందర్శించారు. జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలిక శరీరంపై గాయాలతో కూడి ఉందని, చికిత్స నిమిత్తం బాలికను విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి పంపించారని తెలిపారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి బాగానే ఉందని,తదుపరి దర్యాప్తు నిమిత్తం అవసరమైన ఇంకా కొన్ని పరీక్షలు నిర్వహించవలసి ఉందని వైద్యులు తెలిపినట్లు ఆర్డీవో భవాని శంకరి తెలిపారు. అనుమానితుడి కోసం పోలీసులు పలుచోట్ల గాలింపు చర్యలు చేపట్టారని చెప్పారు. పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నూజివీడు రెవెన్యూ పరిధిలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డిఓ భవాని శంకరి తెలిపారు.

ఇదిలా ఉండగా నిందితుడు చిన్నారిని ఎందుకు కిడ్నాప్ చేశాడు...? ఎందుకు దాడి చేశాడు...? పాపపై అత్యాచారం జరిగిందా?అనే విషయం తెలియాల్సి వుంది. చిన్నారి కాళ్లకు ఉన్న వెండి పట్టీల కోసం చేసి ఉంటాడని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## వైసిపి పాలనతో గ్రామాలన్నీ అస్తవ్యస్తం : ఎమ్మెల్యే చింతమనేని




**దెందులూరు,మేజర్ న్యూస్:** అవినీతి అక్రమాలే లక్ష్యంగా గత 5 ఏళ్ళ పాటు వైసిపి ప్రభుత్వం చేసిన పాలన వల్ల దెందులూరు నియోజకవర్గ వర్గంలోని గ్రామాలన్నీ సమస్యల నిలయంగా మారి అస్తవ్యస్తంగా తయారయ్యాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మీకోసం – మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం దెందులూరు మండలం సీతంపేట, శ్రీరామవరం గ్రామాల్లో సోమవారం ఉదయం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ఎన్టీయార్ విగ్రహానికి, వంగవీటి రంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులను, ఉపాధి హామీ పనులను, పేదల ఇళ్ల నిర్మాణ పనుల పనితీరును అధికారుల నుంచి నివేదికలు తెప్పించి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరా, ఫించన్లు మంజూరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి పలు అంశాలపై తాము ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామస్థుల సమస్యలపై సత్వరమే పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండల పార్టీ అధ్యక్షులు మాగంటి మిల్లి బాబు, సెక్రటరీ నాగన బోయిన సత్యనారయణ, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, క్లస్టర్ ఇంచార్జీ పరసా వెంకటరావు,పార్టీ నాయకులు ఇప్పిలి వెంకటేశ్వర రావు,డాక్టర్ మధు, పర్వతనేని రామక్రిష్ణ, కలపాల బుజ్జి,కూటమి పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం ప్రసంగాన్ని వీక్షించిన జెసి,అధికారులు



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సు కార్యక్రమ ంలో ముఖ్యమంత్రి ప్రసంగం కార్యక్రమాన్ని ఏలూరు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ హాలులో హాజరయ్యారు.

## కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరు అందించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** కృష్ణా డెల్టా శివారు ప్రాంతమైన పెదపాడు మండలం ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్లోని మీకోసం కార్యక్రమంలో డెల్టా రైతులు డిఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. సాగు నీరు ఇచ్చి నాట్లు వేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు మాట్లాడారు. కృష్ణా డెల్టా పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారుల అనాలోచిత చర్యలతో అన్నదాతలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మన సాంబశివరావు, తుమ్మల ధన కోటేశ్వరరావు,కె.రామబ్రహ్మం, కే ఎస్ ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వెలివేశారంటూ ఆరోపణ !





- జ్వరంతో ఉన్నా ఆసుపత్రికి వెళ్లే వీలు లేదు
- 2 రోజుల నుండి పశువులకు మేత లేదు

**బుట్టాయిగూడెం,మేజర్న్యూస్:** జ్వరం వచ్చిన వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి లేదు. రెండు రోజుల నుండి ఎడ్లకు మేకలకు మేత లేదు. ఇట్లు మేకలతో పాటు ఇంటిల్లపాది వస్తుండే పరిస్థితి ఏర్పడుతుందంటూ బాధితులు గగ్గులు పెడుతున్నారు. గ్రామం నుండి వెలివేశారంటు కొంతమంది వ్యక్తులు తమను వేధిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇంటి నుండి బయటకు వెళ్లకుండా దారికి అడ్డంగా చెట్లు కొమ్ములు అడ్డు పెట్టారని జ్వరం వచ్చిన వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి కూడా వీలు లేకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు కన్నీరుగా విలపిస్తున్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కోరం వెంకటేశు తెలిపిన వివరాలు ప్రకారం తన తండ్రి కూరం పొదియ్యకు కూరం లక్ష్మణరావు కూరం సింగరాజు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నట్లు తెలిపారు. సింగరాజుకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని లక్ష్మణరావుకు పిల్లలు లేకపోవడంతో అతని బాగోగులన్నీ తానే చూసానని తెలియజేశాడు. అతని తనంతరం 11 ఎకరాల భూమిని తన పేరు మీద వీలునామా రాసినట్లు పేర్కొన్నాడు. గత ఐదు సంవత్సరాల నుండి ఆ భూమి తానే సాగు చేస్తున్నానని చెప్పారు. ఇటీవల సింగరాజు బంధువులు తాను సాగు చేస్తున్న భూమిలో తమకు వాటా ఇవ్వాలంటూ వివాదాలకు వస్తున్నారని తెలిపారు. ఇటీవల తాను సాగు చేస్తున్న జామాయిల్ తోటను కూడా నరికేసినట్లు తెలిపారు.

ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. బుసరాజు పల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను చూసేందుకు ఆదివారం ఇంటి దగ్గర నుండి వెళ్ళానని తాను తిరిగి వచ్చేసరికి తన ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా చెట్లు కొమ్మలు వేసి ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. దుద్దుకూరు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని గ్రామం నుండి వెలివేశారని మీరు బయటకు రావడానికి వీల్లేదని చెప్పినట్టు బాధితులు ఆరోపించారు. అధికారులు తనకుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు కోరుకుంటున్నారు.

## ఆత్మహత్యకు పాల్పడతానని ఫోన్ చేసిన యువకుడిని రక్షించిన పోలీసులు

- కౌన్సిలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగింత



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా 112 కంట్రోల్ రూమ్కు సోమవారం సాయంత్రం 4.13 గం.లకు లక్ష్మి అను మహిళ విజయవాడ నుండి ఫోన్ చేసి ఆమె సోదరుడు ఏలూరు రైల్వే స్టేషన్ లో ఉన్నానని ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేసినట్లు తెలిపింది. అంతట బాధితుడు ఫోటో,వివరాలు తెలిపింది. ప్రసాదంపాడు, విజయవాడకు చెందిన నక్క రాజేష్,తండ్రి బుల్లబ్బాయి,31 సంవత్సరాలు, వివరాలు తెలుసుకొని, 112 కంట్రోల్ రూమ్ సిబ్బంది ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రావుకి సమాచారాన్ని అందించింది, సమాచారం అందిన వెంటనే అతను ఆచూకీ తెలుసుకోవాలని, ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ పోలీస్ కాని స్టేబుల్స్ 2323,1272 వెంటనే సదరు వ్యక్తి ఆచూకీ తెలుసుకోవడానికి పరిసరాలు పరిశీలించారు. ఏలూరు బస్టాండ్ వద్ద అతనిని గమనించి, వెంటనే స్పందిచి అతణ్ణి పట్టుకొని,సీఐ వద్దకు తీసుకొని వెళ్ళగా, కౌన్సెలింగ్ ఇచ్చి, రక్త బంధువులకు అప్పగించారు.సమాచారం అందించిన వెంటనే ఏలూరు112 కంట్రోల్ రూమ్ వారు, ఏలూరు టూ టౌన్ పోలీస్ వారు స్పందించి బాధితుడు మానసిక సంఘర్షణకు గురైన ఆవ్యక్తిని ఆత్మహత్య చేసుకోకుండా రక్త బంధువులకు అప్పగించిన నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీసు వారికి కృతజ్ఞతలు తెలియ చేశారు.

## ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు

- దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాంబాబు సారధ్యం



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పు హర్షించదగినదని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జీలుగుమిల్లిలోని జగదాంబ సెంటర్లో జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చి ఎంఆర్పిఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి డప్పు వాయిద్యాల నడుమ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా తగరం రాంబాబు మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో ఉన్న 59 కులాలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సంతోషం వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 సంవత్సరాల పోరాట ఫలితమే ఈ వర్గీకరణ అని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు అందించే వర్గీకరణ ఫలాలను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలతో ముందుకు వెళుతూ స్వేచ్ఛగా అన్నదమ్ముల కలిసి అనుభవిద్దామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం నాయకులు ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.36 లక్షల వ్యయంతో జల జీవన్ మిషన్



**కైకలూరు,మేజర్ న్యూస్:** కైకలూరు మండలం చటకాయి గ్రామములో జలజీవన్ మిషన్ పథకం ద్వారా 36 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్స్ ని ప్రారంభించిన శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ఈ సందర్బంగా కామినేని మాట్లాడుతు గ్రామ ప్రజలు ఫిల్టర్ వాటర్ ని సధ్వినియోగం చేసుకోవాలి,ఆరోగ్యంతో ఉండాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి చెయ్యటంలో ఎన్డిఏ ప్రభుత్వం ముందు ఉంటుందని. ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు సధ్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి పేద వాడు సంపన్నులు కావాలని సంక్షేమ పథకాలు అందేలా చెయ్యాలని ఆరోగ్యంతో ఉండే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు,ఎన్డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రావిపాడులో రంగ విగ్రహా ఆవిష్కరణ



**పెంటపాడు,మేజర్ న్యూస్:** బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా వంగవీటి మోహన రంగ పోరాటం మనకు స్ఫూర్తి అని పనస పూర్ణచంద్రరావు తెలిపారు. పెంటపాడు మం డలం రావిపాడు గ్రామంలో వంగవీటి మోహన్ రంగా విగ్రహ ఆవిష్కరణలో ముఖ్య అతిధులుగా కాపు నాయుకులు పనస పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. కాపులు అంటే అల్లరి మూక అని ముద్ర పడింది. దాన్ని రూపు మాపడానికి రక్త దానం, పేద ప్రజలకు సహాయ కార్యక్రమలు చేసి ప్రజా సేవకులుగా మనం ముద్ర వేసు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెన్నాడ సూర్య నారాయణ, మాజీ సొసైటీ చైర్మన్ వెంకటరమణ, జనసేన అధ్య క్షులు మునగాల శివ, మునగాల బాబ్జి ,అడపా నారాయణ మూర్తి, మాక శ్రీనివాసు, ధనరాజు,పెన్నాడా రాఘువులు,దేవా సత్యనారా యణ,దేవావెంకన్న పెన్నాడాశ్రీనివాసు కమిటీసభ్యులు పాల్గున్నారు.

## తల్లీ, కొడుకులకు 'చేయూత' సాయం



**పెదవేగి, మేజర్ న్యూస్:** పేదరికం, నడవలేని దుస్థితిలో ఉన్న తల్లీ కొడుకులకు 'చేయూత' సంస్థ ఆసరాగా నిలిచి, ఆర్థికసాయం అందించింది. పెదవేగి మండలం జానంపేట పంచాయతీ ప్రకాష్నగర్కు చెందిన మిరియాల సీతారావమ్మ వృద్ధాప్యం, ఆపై అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు కుమారుడు లాజర్, వివాహమైన కుమార్తె ఉన్నారు. లాజరు వికలాంగత్వంతో కదలలేని స్థితిలో ఉన్నాడు. కాగాఆ ఇద్దరు ఆనారోగ్యంతోపాటు, ఆర్థికంగానూ ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆమె కుమార్తె మరియమ్మ ఆ ఇద్దరి ఆలనా పాలనా చూస్తోంది. వారి ఆర్థిక పరిస్థితికూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ విషయం తెలుసుకున్న పెదవేగికి చెందిన చేయూత సంస్థ సభ్యులు ఈనెల సాయం ఆ ఇద్దరికీ అందించాలని నిర్ణయించుకుని, వికలాంగుడైన లాజర్కు వీల్చైర్ తోపాటు రూ.10 వేలు నగదునుకూడా అందించారు. ఈ కార్యక్రమంలో చేయూత సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున. మరీదు లక్ష్మణరావు, జి.దుర్గాప్రసాద్,ఆర్.మహేష్, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం ఫుల్ - పంచదార నిల్



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్ల గోదాంలో బియ్యం పుష్కలంగా ఉన్నాయి, జూన్ జూలై నెలలో రేషన్ ద్వారా ప్రజలకు అందించే నిత్యవసర సరుకులలో పంచదారను సప్లై చేయటం లేదు, దీంతో అనేకమంది పేద, మధ్యతరగతి ప్రజలు బయట మార్కెట్లో పంచదార కొనాలంటే భయపడుతున్నారు, రేట్లు అధికంగా ఉండడంతో నిత్యవసర సరుకులలో పంచదారకు డిమాండ్ ఏర్పడింది, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ఈ పరిస్థితి నెలకొనడం పై పలువురు ఆవేదన చెందుతున్నారు, ఆగస్టు నెలలో ఇదే పరిస్థితి ప్రభుత్వం ఆలోచించి నిత్యవసర సరుకులు రేషన్ డీలర్ల ద్వారా అందించాలని కోరుతున్నారు,

# పితానిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బండారు



**నర్సాపురం,మేజర్ న్యూస్:** టిడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు ఎస్వికెపి కళాశాల ప్రెసిడెంట్ పితాని సూర్యనారాయణ (76) ఆదివారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. సోమవారం మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు కొమ్ముచిక్కాలలో సూర్యనారాయణ భౌతిక కాయానికి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను కలసి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మొగల్తూరు మండలం, కాళీపట్నం వెస్ట్ గ్రామంలో సోమవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ కడలినాగేశ్వరరావు అకస్మికంగా మృతిచెందారు. కాళీపట్నంలో నాగేశ్వరరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా చదివితే అత్యున్నత శిఖరాలు





## - జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ మురళీకృష్ణ

**నరసాపురం రూరల్,మేజర్న్యూస్:** విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ప్రణాళిక బద్ధంగా చదివితే అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చునని జేఎన్టీయూ కాకినాడ వైస్‌ఛాన్సర్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. సోమ వారం మండలంలోని సీతారాంపురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల మొదటిసంవత్సరం క్లాసులు ప్రారంభం సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మురళీకృష్ణ మాట్లాడుతూ జేఎన్టీయూ కాకినాడ అనుబంధ కళాశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వివిధ దేశాల్లో కార్పొరేట్ కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, దీనంతటికీ కారణం ప్రణాళిక బద్ధంగా చదవటమే అన్నారు. క్లాసులు చెప్పేటప్పుడు రన్నింగ్ నోట్స్ రాసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, నేర్చుకున్న దానిని ఎక్కువ మందికి చెప్పటం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి చిన్న లైబ్రరీని ఏర్పాటు చేసుకుని మార్కెట్లో దొరికే పుస్తకాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. నీటిని, ఆహార పదార్థాలను వృధా చేయకూడదని, వాటిని పొదుపు చేయటం ద్వారా పదిమందికి ఉపయోగపడవచ్చు అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ కె వి సత్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యాసంస్థల కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్,పండరీనాథ్, స్వామినాథన్ తదితరులు మాట్లాడారు. స్వర్ణాంధ్ర విద్యాసంస్థలపై తమకు గల నమ్మకాన్ని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు వివరించారు. అనంతరం వైస్ ఛాన్సర్ మురళీకృష్ణను యాజమాన్యం తరపున సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

# ఏఐటీయూసీ గోడ పత్రికల ఆవిష్కరణ



**ఏలూరు,మేజర్ న్యూస్:** కార్పొరేట్ సంస్థల సంపదను పునః పంపిణీ చేసి కష్టజీవుల అభ్యున్నతికి ఖర్చు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగింది. సమావేశం సందర్భంగా సెప్టెంబరు 1 నుంచి 3 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబైలో ఆర్భవించిన ఏఐటియుసి గత 104 సంవత్సరాలుగా భారతదేశ కార్మిక వర్గానికి ఉద్యోగ వర్గానికి అనేక హక్కులను రాయితీలను సాధించిపెట్టిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు ఉప ప్రధాన కార్యదర్శులు చాట్ల పుల్లారావు తొర్లపాటి బాబు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జి అంజమ్మ జిల్లా సహాయ కార్యదర్శి ఏ అప్పల రాజు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు ఏఐటియుసి నాయకులు కారం దారయ్య ఎస్కే సైదా కారం కుమారి బి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా చిహ్నాలు పాటించాలి




**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా శాఖ చైర్మన్ బివి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 5 అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ వాలంటీర్లు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా వాహన ప్రమాదాలు జరగడానికి ముఖ్య కారణం రోడ్డు భద్రతా చిహ్నాలు పాటించకపోవడమేనని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎండ, వాన, చలి వంటివి లెక్కచేయకుండా అహర్నిశలు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్న ట్రాఫిక్ పోలీస్ వారికి ఈ సందర్భంగా కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ట్రాఫిక్ సిఐ కే.శ్రీనివాసరావు రెడ్ క్రాస్ వాలంటీర్లకు అభినందనలు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, ట్రాఫిక్ ఏఎస్ఐ ఏ వై ఆర్ రాజు, సోషల్ వర్కర్ సిహెచ్.వి సురేంద్ర, డాక్టర్ జి.స్పందన, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ వి.నాగరాజు, ట్యూటర్లు అనూష, ఏ.ప్రియాంక, రెడ్ క్రాస్ ఏఎన్ఎం నర్సింగ్ విద్యార్థినీలు, కానిస్టేబుల్స్ సురేష్, నాగరాజు, కే శ్రీనివాస్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు డైజీ ప్లేయర్‌లు ఉచిత పంపిణీ



**ఏలూరు,మేజర్ న్యూస్:** విభిన్న ప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థినీ, విద్యార్థులకు డిఆర్ఓ డి.పుష్పమణి డైజీ ప్లేయర్‌లను అందించారు. చింతంపల్లికి చెందిన కుమారి జరపాల నాగలక్ష్మి ఏలూరులోని కొత్తదిబ్బ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఇంటర్మీడియట్ విద్య నభ్యసిస్తున్నది. సీతానగరంకి చెందిన శ్రీ జరపాల కుమార్ నాయక్ ఏలూరులోని కొత్తదిబ్బ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఇంటర్మీడియట్ విద్య నభ్యసిస్తున్నాడు తమకు డైజీ ప్లేయర్.లు మంజూరు చేయవలసిందిగా గతంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సదరు విద్యార్థినీ, విద్యార్థులు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరియున్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం సదరు ఇద్దరు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థినులకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో డైజీ ప్లేయర్.లను జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్.ఎస్.కెఖాజావలి,ఎస్డీసీ ఎం.ముక్కంటి, విభిన్నప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాకడ మణి, ప్రభృతులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసుల చర్యలు




**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయములో సోమవారం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ జి స్వరూప రాణి జంగారెడ్డి గూడెం డిఎస్పీ యు రవిచంద్ర పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోగల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సుమారు 50 ఫిర్యాదులన్నింటి పై సత్వరమే చట్ట ప్రకారం ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో అదనపు ఎస్పీ అడ్మిన్ ఫోన్‌లో మాటలాడి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదిదారులకు భోజన సదుపాయాలను శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు, జిల్లా కేంద్రానికి రాబడిన ఫిర్యాదుదారులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడంపై ప్రజలు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలను తెలియజెశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కొంతమంది సైబర్ నేరగాళ్లు సదర అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ మీ మీ అకౌంట్లో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు తస్కరించిన వెంటనే సెంట్రల్ సైబర్ సెల్ నెంబర్ 1930కు సమాచారం అందించాలని కోరారు.

## సెప్టెంబర్ 1 నుండి 21వ పశుగణన : జేసీ ధాత్రిరెడ్డి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లాలో సెప్టెంబర్, 1వ తేదీ నుండి డిసెంబర్, 21 వతేదీ వరకు పశుగణన నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో సోమవారం పశుగణన గోడపత్రికను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పశుగణన ప్రతీ 5 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం జరుగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా.జి.నెహ్రు బాబు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని గేదెలు,ఆవులు, గొర్రెలు,మేకలు, కుక్కలు వంటి జీవాలను లెక్కించడం జరుగుతుందన్నారు. వాటి వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లోపొందుపరచడం జరుగుతుందని,417 మంది ఎన్యూమరేటర్లు, 67 మంది సూపెర్వైజర్లు పశుగణన చేస్తారన్నారు. వీరికి ఈనెల 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖఅధికారులు డా.టి.గోవిందరాజులు, డా.సుబ్రహ్మణ్యం, డా.బి.ఎన్.వి.,లక్ష్మీ నారాయణ, డా. హర్ష, డా.జాహ్నవి, ప్రభృతులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు




ఏలూరు,మేజర్ న్యూస్: కోరిన కోర్కెలు తీర్చే తల్లి, ఈ జగతిని ఏలే తల్లి ఆ కనకదుర్గమ్మ అమ్మవారు అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి),ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు.. ఏలూరు నియోజకవర్గం 13 వ డివిజన్ పరిధిలోని పోణంగి గ్రామం వైఎస్సార్ కాలనీ లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాడ మాస సారీ మహోత్సవాన్ని నూతన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ వైయస్సార్ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఏదైతే నూతన కమిటీ ఏర్పడిందో, వారందరు కూడా సమిష్టిగా అమ్మవారికి స్నానం చేయించడం జరిగిందని, నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ కాలనీ ప్రారంభంలో ఉన్నప్పుడు ప్రజలు అందరు కూడా ఒక దేవాలయం కావాలనే ఉద్దేశంతో ఈ ఆలయాన్ని నిర్మాణం చేసుకొని, ఆలయానికి స్థలాన్ని కేటాయించుకుని ప్రారంబించి ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం,చోడే బాలసుబ్రహ్మణ్యం, అమ్మవారి ఆలయ అభివృద్ధి గౌరవ అధ్యక్షులు కె.యేసు, ప్రెసిడెంట్ పోలవరపు సురేష్, వైస్ ప్రెసిడెంట్ కూర్మ కోట బసవయ్య, సెక్రటరీ గోపీ,ఆలయ కమిటీ సభ్యులు కుర్మా సరళ, నాగమణి, వరలక్ష్మీ, స్థానిక నాయకులు సాయి,మణికంఠ, సురేష్,బాలు,పండు, శివ,నవ్య,అప్పల స్వామి, వెంకట్రావు, ఐశ్వర్య, ఏడుకొండలు, శ్రీను, వివిధ హోదాల్లో ఉన్న జనసేన తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో భక్తులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## దెందులూరు తహశీల్దారుగా బి.సుమతి



**ఏలూరు,మేజర్ న్యూస్:** దెందులూరు తాసిల్దారుగా బత్తుల సుమతి సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు 2012లో వరంగల్ జిల్లా నరసింహులు పేట తహసీల్దారుగా సర్వీసులో చేరారు 2014లో ఖమ్మం జిల్లా కామేపల్లి తాసిల్దారిగా బదిలీ అయ్యారు రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు తాసిల్దారుగా ఏలూరు కలెక్టరేట్లో ఆర్డీవో ఏ. ఓ జంగారెడ్డిగూడెం పోలవరం తాసిల్దారుగా పనిచేశారు. ఎన్నికల విధులు నిర్వహణ నిమిత్తం కృష్ణాజిల్లా చల్లపల్లి తాసిల్దార్ గా బదిలీపై వెళ్లారు ప్రస్తుతం జరిగిన బదిలీల్లో చల్లపల్లి నుంచి దెందులూరు తాసిల్దారుగా నియమితులయ్యారు..తాసిల్దార్ బి సుమతి పోలవరం తాసిల్దారుగా పనిచేసిన 2021 22 సమయంలో పోలవరం మండలంలో 19 గ్రామాల్లోని మూడువేల నిర్వాసిత కుటుంబాలను అక్కడ నుంచి ఆర్ఎన్ఆర్ కాలనీలకు తరలించారు. ఉన్నతాధికారుల ప్రోత్సాహం ప్రజా ప్రతినిధు లు సిబ్బంది సహాయ సహకారాలతో దెందులూరు మండల అభివృద్ధికి తాసిల్దారుగా తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

## బాధ్యతలు చేపట్టిన నూతన ఎమ్మార్వో శ్రీనివాస్ రావు



**పెంటపాడు,మేజర్ న్యూస్:** పెంటపాడు మండల తహసీల్దారుగా పదవి బాధ్యతలు చేపట్టిన ఏడిద శ్రీనివాసరావు. నరసాపురం తహసిల్దార్ కార్యాలయంలో ఏవోగా పనిచేసిన శ్రీనివాసరావు నేడు పెంటపాడు తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తాసిల్దార్‌గా పనిచేసిన సురేష్ బాబు నందిగామకు బదలి అయ్యారు. వీరిని పలువురు నాయకులు కలుసుకొని సత్కరించారు.

# మంచినీటి చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే నాయకర్



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామం, కరింశెట్టిపాలెంలో గల మంచినీటి కుళాయి చెరువును నర్సాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. ఇటీవల కాలంలో గ్రామస్తుల నుండి మంచినీటి సరఫరాపై, ప్రజలు తమ గోడును ఎమ్మెల్యే నాయకర్ వద్ద వినపించడంతో, సోమవారం ఆర్.డబ్ల్యూ. ఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే నాయకర్ కుళాయి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న ప్రజలు, మంచినీటి చెరువులో వాటర్ లెవెల్ సరిగా లేకపోవడంతో ఉప్పు నీరు వస్తుందని, చెరువు పూడిక తీయాలని, మంచినీటి సరఫరా సరిగా ఉండటంలేదంటూ, అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ,నియోజకవర్గంలో మంచినీటి సమస్య అధికంగా ఉందని,ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, త్వరలో గ్రామంలో మంచినీటి సరఫరాను మెరుగు పరుస్తామని, సుమారు 12ఎకరాలు లోపల వైశాల్యం గల కుళాయి చెరువును ఆధునీకరిస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబ్ల్యూ. ఎస్.జె.ఇ.టి.లోకేష్, ఆకన చంద్రశేఖర్, వలవల నాని,బొక్క రాధాకృష్ణ, బండెల రవీంద్ర, గంట కృష్ణ, వాతాడి ఉమ, కడలి పద్మారావు, ఒడుగు ఏసుబాబు,బళ్ళ హనుమంతు, పులపర్తి రాంబాబు,పులపర్తి సత్య నారాయణ,వలవల మురళి,నడిపూడి కృష్ణ,పుచ్చకాయాల తిరుపతమ్మ, మైల శివ,వడ్డిఆదినారాయణ,కడలి నాగేశ్వరారావు,నాగరాజు జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మండల సమాఖ్యలో అవగాహన సదస్సు



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార అథారిటీ వారి ఆదేశాల మేరకు నర్సాపురం మండల న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారంస్థానిక మండల సమాఖ్య కార్యాలయం నందు డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే వితంతువు పించన్ పథకం మానసిక,అంగ వైకల్యం కలిగిన వారికి న్యాయ సేవా సంస్థ అందించే సేవల పై నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమానికి న్యాయవాది నామినేటెడ్ సభ్యులు చల్లా దానయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతు పింఛన్ పొందడానికి అర్హులై ఉండి పించాన్ పొందలేని వారు న్యాయ సేవా సంస్థను దరఖాస్తు రూపంలో లేక స్వయంగా సంప్రదించిన న్యాయ సహాయం పొందగలరని, అలాగే మానసికంగా అనారోగ్యంతో బాధపడేవారు, అంగ వైకల్యం కలిగిన వారు కూడా న్యాయ పరంగా వారు పొందవలసిన హక్కుల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది లీగల్ సర్వీసెస్ సభ్యులు వై.దేవేంద్ర ఫణికర్, పానెల్ లాయర్స్ కె.చిట్టి పద్మజ, కె.శిరీష,ఎ పియంపిప్పల్ల పద్మ తదితరులు మాట్లాడారు.

# కళాశాల అధ్యక్షులు పితాని సూర్యనారాయణ హఠాన్మరణం



**పెనుమంట్ర,మేజర్ న్యూస్:** ఎస్వికెపి డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల అటానమస్ పెనుగొండ పాలకవర్గ అధ్యక్షులుగా ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా పారిశ్రామిక వేత్తగా సమాజానికి సుదీర్ఘ సేవలందించిన సేవానిరతి స్ఫూర్తి ప్రదాత పితాని సూర్యనారాయణ సోమవారం ఉదయం హఠాన్మరణం చెందటం చాలా విచారకరమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.వి అప్పారావు తెలియ జేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈయన 1949 మే నెల 5వ తేదీ కీర్తిశేషులు పితాని వెంకన్న చంద్రమ్మ దంపతులకు జేష్ఠ కుమారులుగా జన్మించారు వీరికి ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు. ఈయన 2002 సంవత్సరం నుంచి కళాశాల పాలకవర్గ అధ్యక్షులుగా కళాశాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహిస్తూ కళాశాల దినదినాభివృద్ధి చెందడంలో ఎంతో కృషి చేశారు. శ్రీ సూర్యనారాయణ హఠాన్మరణం చాలా బాధాకరమని సెక్రటరీ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ కళాశాల అధ్యాపక అధ్యాప కేతర సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. కాగా సూర్యనారాయణ మాజీ మంత్రి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ సోదరుడు కావడంతో పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# నిర్వాసితుల భూముల్లో పంటలకు రక్షణ కల్పించండి

## - శివ గిరి గ్రామ నిర్వాసితులు అధికారులకు విజ్ఞప్తి



**జీలుగుమిల్లి,మేజర్న్యూస్:** నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లోని పంటలకు రక్షణ లేకుండా పోయిందని తమ పంటలకు రక్షణ కల్పించాలని నిర్వాసితులు అధికారులను వేడుకుంటున్నారు. సోమవారం పోలవరం ముంపు నిర్వహిత గ్రామమైన శివగిరి గ్రామస్తులు మాట్లాడుతూ పి నారాయణపురం గ్రామంలో 218 ఎకరాల భూమిని ప్రభుత్వం తమ గ్రామస్తులకు కేటాయించిందని తెలిపారు. ఈ భూములకు ప్రభుత్వం తమకు పట్టాలు మంజూరు చేసిందని అయితే ఇటీవల కొంతమంది తమ భూముల్లోకి వచ్చి పామాయిల్ గెలలను నరికి దౌర్జన్యంగా ట్రాక్టర్ల పై తీసుకెళ్లడమే కాకుండా తమ భూముల్లో ఉన్నబోర్లను,పంపులను నాశనంపాడుచేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇంకా తమ గ్రామానికి 70 ఎకరాలు భూమినీ కేటాయించాల్సింది ఉందని అన్నారు. అయితే ఈ భూమిని తామంతా గత కొంత కాలంగా కౌలుకు ఇచ్చి జీవనోపాధి పొందుతున్నామన్నారు. ప్రస్తుతం కొందరు దౌర్జన్యం చేయడంతో కవులుకూడా లేక తిండిలేనిదుస్థితికి నిర్వాసితులం ఉన్నామనిఆవేదనవ్యక్తంచేశారు.

ప్రభుత్వంతక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అరగంటి కృష్ణకుమారి,బాడిస తమ్మన్న దొర,కొవ్వాసి రాములమ్మ, విజయ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
పశ్చిమ గోదావరి
మంగళవారం, 6 ఆగస్టు 2024
3



## తల్లి పాల వారోత్సవాల వేడుక

**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని రాజాపంగిడిగుడెం గ్రామంలోని అంగన్వాడి కేంద్ర నందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలును వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రములో జంగారెడ్డిగూడెం ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పరిదిలో గల ద్వారకాతిరుమల సెక్టార్ సూపర్ వైజర్ టి.మేరీ మాట్లాడుతూ తల్లిపాల వల్ల శిశువులకు కలిగే ప్రయోజనాలను, పోషక విలువలను, గర్భిణీలు. బాలింతలు తీసుకోవలసిన ఆరోగ్యపరమైన విషయాలను అంగన్వాడీ లబ్ధిదాలులకు వివరించారు.కాగా ఈ సంవత్సరం తల్లిపాల వారోత్సవాల థీమ్ అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రొత్సోహించడం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ చే దోమల నివారణ



**ఏలూరు,మేజర్న్యూస్:** 1జూలై 2024, నుండి 31, ఆగస్టు, 2024 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) వారి ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 6వ డివిజన్ లోని మాదేపల్లి ఇంద్రమ్మ కాలనీ , చెంచు కాలనీ, మాదేపల్లి మెయిన్ మెయిన్ రోడ్, తదితర ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. దోమల లార్వా నిర్మూనలకు స్ప్రేయింగ్,మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలలోఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.మాలతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాకాల రమేష్,మలేరియాఇన్స్పెక్టర్ దత్తివేణుగోపాల్స్వామి,మలేరియా సూపర్వైజర్ డి.దుర్గారావు, ఆరోగ్య కార్య దర్శి, ఆశా కార్యకర్తలు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# 229 ప్రజా ఫిర్యాదులు - సకాలంలో పరిష్కరించాలి

**ఏలూరు,మేజర్ న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన అర్జీలకు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ముక్కంటి, భాస్కరరావు, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్ కె ఖాజావలి లతో కలిసి డిఆర్ఓ పుష్పమణి ప్రజల నుండి 229 అర్జీలను స్వీకరించారు.

– అందిన అర్జీలలో కొన్ని –జంగారెడ్డిగూడెంకు చెందిన కొవ్వాసి కన్నయ్య తన దరఖాస్తులో తనకు గల 1.94 సెంట్ల భూమిని 22ఏ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించవలసిందిగా కోరారు. సదరు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవలసిందిగా జంగారెడ్డిగూడెం ఆర్డీఓను డిఆర్ ఓ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో రాష్ట్రంలో కృష్ణా,గోదావరి నాదీ జలాల పునఃపంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడవలసిందిగా కోరారు. భీమడోలు కు చెందిన టి.కృష్ణకుమార్ తన భూమి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయవలసినదిగా కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవలసిందిగా భీమడోలు తహసీల్దార్ ను ఆదేశించారు. పోలవరం మండలం ఇటికలకోట కు చెందిన చిడిపి ఫణింద్రకుమార్ తనకు ఆంధ్రప్రదేశ్ భూదాన యజ్ఞ బోర్డు వారు కన్నాపురంలో 5 ఎకరాల భూమిని మంజూరు చేసారని,సదరు పట్టా మంజూరుచేసి, ఆన్లైన్ లో నమోదు, పట్టాదారు పాస్ బుక్ జారీ చేయాలనీ కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని పోలవరం తహసీల్దార్ ను ఆదేశించారు. మండవల్లికి చెందిన నల్లగొండ నాంచారమ్మ తనకు గతంలో వృద్ధ్యపు పెన్షన్ మంజూరైందని, కానీ తన



పేరుమీద 2 విద్యుత్ కనెక్షన్లు ఉండడంతో పెన్షన్ రద్దు చేసారని, తనకు పెన్షన్ పునరుద్దరించవలసిందిగా కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని మండవల్లి ఎంపిడిఓని డిఆర్ఓ ఆదేశించారు. లింగపాలెం మండలం అయ్యపరాజుగూడెం కు చెందిన మెత్తపల్లి సీతారామయ్య తానూ కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్నానని, తనకు దీర్ఘకాలిక రోగుల పెన్షన్ మంజూరు చేయాలవసిందిగా కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ను ఆదేశించారు. ముసునూరు మండలం సరిపల్లి కి చెందిన ఆముదాల రంజిత్ కుమార్ తన దరఖాస్తులో తమ గ్రామంలో పేదల ఇళ్లస్థలాల మంజూరులో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ చేసి, అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలనీ కోరగా, విచారణ చేసి నివేదిక సమర్పించాలని నూజివీడు ఆర్డీఓ ని డిఆర్ఓ ఆదేశించారు. చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామానికి చెందిన గోదా రాములు తమ భూమిని 22 ఏ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించాలని కోరగా,విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక వేత్త చవ్వాకుల భరత్‌కు నార్వే ఫెలోషిప్ అవార్డు




**తణుకు,మేజర్ న్యూస్:** సామాజిక సేవా రంగంలో గత 25 సంవత్సరాలుగా నిశ్శహయలు, నిర్భగ్యులకు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు, సేవలు చేస్తూ, అనేక జాతీయ, అంతర్జాతీయ స్వచ్చంద సేవా సంస్థలతో కలిసి పనిచేస్తున్న పీస్ ఇండియా స్వచ్చంద సేవా సంస్థ వ్యస్థాపక కార్యదర్శి చవ్వాకుల. వి.ఆర్.భరత్ కుమార్‌కు అన్నా ఇంటర్నేషనల్ స్వచ్చంద సేవా సంస్థ అంతర్జాతీయ డైరెక్టర్ సోల్ ఫ్రిడ్ స్వేండ్సేన్(నార్వే) 80వ జన్మదినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో అన్నా మినిస్ట్రీస్ ఇండియా సేవా సంస్థ కేంద్ర కార్యాలయంలో సేవా సంస్థల సమ్మిట్ ఇండియా డైరెక్టర్ ఇసుకపట్ల. ఇమ్మనుయేల్కుమార్అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగా జరిగిన సేవా కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గన్న స్వర్ణంద్రా సేవా సంస్థ అధ్యక్షులు గుబ్బల. రాంబాబు మాట్లాడుతూ విద్యా, వైద్య ఆరోగ్యం,సామాజిక, మానవ హక్కులకోసంభరత్ చేశారని అన్నారు. ఈ సందర్బంగా మెమోంటో, దుశాలువా, ప్రశంసపత్రం, ఫెలోషిప్ అవార్డు సర్టిఫికెట్ ఇచ్చి సత్కరించారు. ఈకార్యక్రమంలో కోరుకొండ. జాన్, మైలాబత్తుల విజయ కుమార్, గిడ్ల కిశోర్, మనుబర్తి లలిత, టి. రమాదేవి,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి - మహిళా సమాఖ్య డిమాండ్

**ఏలూరు,మేజర్ న్యూస్:** నూజివీడు మండలంలో జరిగిన చిన్నారి పై దాడి,అత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా జరిగే దారుణమైన ఘటనల పట్ల నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. బాధితుల కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు చిన్నారుల జీవితంపై తీరని గాయం చేస్తాయని, వారి మానసిక స్థితి ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## సర్దార్ పాపన్న గౌడ్ జయంతి పోస్టర్లు ఆవిష్కరణ



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** భారతమాత ముద్దుబిడ్డ తొలి తెలుగు బహుజన చక్రవర్తి శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 374 వ జయంతి ఆహ్వానం పోస్టర్లను జై గౌడ్ జిల్లా అధ్యక్షులు పరస వీర్రాజు,జిల్లా కార్యదర్శి మిగతా చందు ఆధ్వర్యంలో మండలంలోని పంగుడి గూడెం గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్ మాట్లాడుతూ 17వ సంవత్సరం ఈనెల 11 తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భరతమాత ముద్దుబిడ్డగా తొలి తెలుగు చక్రవర్తిగా ఏడున్నర నెలలు నల్గొండ సామ్రాజ్యాన్ని పాలించి గోదావరి నది, కృష్ణానది, భీమా నది, మధ్యనున్న ప్రాంతాన్ని 30 సంవత్సరాలు పాలించి 21 కోటలు కట్టించిన చక్రవర్తి శ్రీశ్రీశ్రీ సర్దార్ పాపన్న మహారాజ్ చరిత్ర ప్రపంచ ప్రసిద్ధిగాంచిందని అన్నారు. అనంతరం వేరువేరు ప్రాంతాల నుండి వచ్చిన గౌడకులస్తులకునూతనజిల్లా, నియోజకవర్గలు, మండలాలు, గ్రామల,కమిటీ సభ్యులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## పలువురు టిడిపి సభ్యులను పరామర్శించిన టిడిపి నేత బాబ్జి





తాడేపల్లిగూడెం/పెంటపాడు,మేజర్ న్యూస్: తాడేపల్లిగూడెం రెండో వార్డుకు చెందిన ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలుగుదేశం నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి. వీరితో పట్నాల రాంపండు ఏరు బండి సతీష్ అంబటి వాసు ఉన్నారు. ముందుగా పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామం కోడూరు సత్యనారాయణ మరణించగా వారి కుటుంబ సభ్యులను బాబ్జి పరామర్శించారు. పెంటపాడు గ్రామం చామన కామాక్షి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో కిలపర్తి వెంకట్రావు దాసరి అప్పన్న గోపాలకృష్ణ చంద్రశేఖర రావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో సూక్ష్మ సేద్య పథకములో బిందు మరియు తుంపర సేద్య పరికరములు ప్రభుత్వ రాయితీ పై రైతులకు అందించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు,భూమి యాజమాన్య పత్రము జత చేసి సంబంధిత మండల ఉద్యాన అధికారి,గ్రామ వ్యవసాయ సహాయకుడు,గ్రామ సెరీకల్చర్ సహాయకుడు,సూక్ష్మ నీటి పారుదల ప్రాంత అధికారులతో గాని లేక సంబంధిత గ్రామ రైతు సేవా కేంద్రము (ఆర్.ఎస్.టి) లేదా జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసు, ఏలూరు కార్యాలయము నందు బయోమెట్రిక్ ద్వారా నమోదు ప్రక్రియ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 15 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. 3 ఎకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం,5 ఎకరాల నుండి 12.5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 30 శాతం రాయితీపై అందించడం జరుగుతుందన్నారు. స్ప్రింక్లర్లు చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీతో అందించడం జరుగుతుందన్నారు.

## చాంబర్స్ కళాశాలలో సిఎంఎస్ కార్యక్రమం




**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక బిఆర్ ఆర్అండ్జికేఆర్ చాంబర్స్ కళాశాల నందు. అంతర్జాతీయ కామస్ దినోత్సవం సందర్భంగా కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విద్యార్థినీ విద్యార్థులు , ఉపాధ్యాయులు కలిసి సి ఎం ఎస్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిస్టర్ బి ఎన్ ఎస్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ కమర్షియల్ టాక్స్ ఆఫీస్ పాలకొల్లు ప్రొఫెసర్ జగన్మోహన్ రెడ్డి చైర్మన్ డిఓఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఎకేఎన్యు రాజమహే ంద్రవరం హాజరైనారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు కళాశాల అకాడమిక్ అడ్వైజర్స్ ఏబిఎస్ మూర్తి , నందుల సీతారామారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు కళాశాల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వోల్గా మేడం,ముఖ్య అతిథి వెంకటేశ్వరరావు సిటిఓ విశిష్ట అతిథి. ప్రొఫెసర్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు..

## సమస్యల పరిష్కార వేదికలో 11 ఫిర్యాదులు : ఇన్చార్జి కమిషనర్



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** తాడేపల్లి గూడెం పురపాలక సంఘ కార్యాలయంలో నేడు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ భాగాలకు చెందిన మొత్తం 11 ఫిర్యాదులు వచ్చాయని ఇన్చార్జి కమిషనర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణ ప్రణాళిక విభాగం పై 9, రెవెన్యూ మరియు ఆరోగ్య విభాగాలపై ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదుల అందాయని తెలియజేశారు. ఆయా శాఖల ద్వారా 11 సమస్యల పరిష్కారాలకు త్వరితగతిన పూర్తి చేస్తామని మురళీకృష్ణ తెలియజేశారు.

## సర్వ జీవావళిని కాపాడే భూదేవతలు అడవులు

చింతలపూడి,మేజర్ న్యూస్: చింతలపూడి మండలం కొమ్ముగూడెం అడవుల్లో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో వేప,నేరేడు,జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం మొదలగు విత్తనాలు చల్లడం జరిగింది. జిల్లా నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ అడవులు జీవ వైవిధ్య నిలయాలు మాత్రమే కాకుండా మానవ అవసరాలను తీరుస్తూ, పర్యావరణాన్ని కాపాడే భూరక్షకులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులు ధరావత్ కాంతారావు నాయక్,సంఘ కోశాధికారి హసావత్ శివ నాయక్,ధరావత్ రమేష్, భాస్కర్ నాయక్, హంక్యా నాయక్, రాజేష్, చంద్రబాబు, హసావత్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సోదరుడు సూర్యనారాయణ గుండెపోటుతో మృతి

**– తెలంగాణ రిటైర్డ్ సిఎస్ సోమేశ్ కుమార్ నివాళి**

**పొదూరు, మేజర్ న్యూస్:** టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు,మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు, ప్రముఖ లేస్ వ్యాపారి, విద్యావేత్త పితాని సూర్యనారాయణ(76) ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పితాని సూర్యనారాయణ ఆంధ్ర యూనివర్సిటీ పాలకవర్గ సభ్యుడిగా, లేస్ ఎక్స్పోర్టర్గా, ఎస్వికెపి కళాశాల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. పితాని సత్యనారాయణ కు స్వయాన సోదరుడు. పితాని సూర్యనారాయణ మృతి చెందారని వార్త తెలియడంతో హుటాహుటిన హైదరాబాదు నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ పోడూరు మండలం కొమ్ముచిక్కాల చేరుకున్నారు. సూర్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి కన్నీరు పర్యంతమయ్యారు. దీంతో బంధువులు అభిమానులు పితాని సత్యనారాయణ కలిసి ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. స్నేహశీలి మిత్రుడు సూర్యనారాయణ మరణ వార్త బాధించిందని తెలంగాణ రిటైర్డ్ సిఎస్ సోమేశ్ కుమార్అన్నారు. ఆయనతో ఆయనకున్న అనుబంధాన్ని మిత్రులతో పంచుకున్నారు. సూర్యనారాయణ ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు సాయంత్రం జరిగిన అంతిమయాత్రలో సోమేశ్ కుమార్ పాల్గొన్నారు.

– పలువురు రాజకీయ ప్రముఖులు నివాళి

–మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు



పితాని సూర్యనారాయణ గుండెపోటుతో మరణించారని తెలియడంతో పోడూరు మండలం కొమ్ము చిక్కాల ఆయన నివాసంలో పితాని సూర్యనారాయణ భౌతిక సందర్శించి పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జనసేన టిడిపి బిజెపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ మేక శేషు బాబు, అంగర రామ్మోహన్ రావు, మల్లుల లక్ష్మీనారాయణ, మాజీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ, బండారు మాధవ నాయుడు టిడిపి బీసీ సాధికారిక రాష్ట్ర అధ్యక్షులు కుడిపూడి సత్తిబాబు, మేక కోటేశ్వరరావు, లేస్ బిజినెస్ ఎక్స్పోర్ట్ కలవకొలను తులసి రావు, జడ్పిటిసి గుంటూరు పెద్దరాజు,తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

# ప్రజా ఫిర్యాదులకు పూర్తి పరిష్కారం చూపాలి



**భీమవరం,మేజర్ న్యూస్:** సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కె.ఆర్ ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 206 ఫిర్యాదులు అందాయని,వాటికి తక్షణ పరిష్కారం ఉండాలన్నారు.

– గ్రీవెన్స్ ద్వారా అందిన కొన్ని ఫిర్యాదులు – కె.అనంతలక్ష్మి, ఆచంట,వంకటాల చెరువు. నాలుగు సంవత్సరాల క్రితం తన భర్త టాక్టరు ప్రమాదంలో చనిపోయారని తాను ముగ్గురు పిల్లలతో కుటుంబం పోషణ భారంగా ఉంది తన భర్తకు రావలసిన ప్రమాద బీమా ఇప్పటివరకు రాలేదు దయచేసి ప్రమాద బీమా సొమ్ము ఇప్పించాలని ఫిర్యాదులో కోరారు. కమ్మల సత్యవతి, భీమవరం, చెక్క వారి వీధి. తన భర్త చనిపోయి 19 నెలలు అయినది ఏమి ఆధారము లేదు వితంతు పింఛను ఇప్పించాలని ఫిర్యాదులో కోరారు. యాద%శీ% రెడ్డి సూరిబాబు, పోలిశెట్టి మధుసూదన రావు, నరసాపురం మండలం కొప్పర్రు. కొప్పరు గ్రామ పంచాయతీకి చెందిన సుమారు రూ:50 లక్షలు నిధులు అవినీతి జరిగినవి వెంటనే అధికారులు దర్యాప్తు చేసి పంచాయితీ నిధులు పక్కదారి పట్ట కుండా చూడాలని ఫిర్యాదులో కోరారు. వలపు వెంకట సత్యనారాయణ, ముగాళ్ళ నరసింహమూర్తి, మేక వెంకటేశ్వర్లు, తదితరులు.కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామం నుండి గ్రామంలో పేరంటాలమ్మ పోరంబోకు చెరువు ను 30 సంవత్సరాలుగా పశువుల త్రాగునీరు కొరకు వినియోగించుచున్నాము ఇటీవల పంచాయితీ వారు చెరువును చేపల పెంపకం నాకు వేలంపాట పెట్టి ఉన్నారు. పాట దారుడు చేపల మేతగా నానా వ్యర్థములు చెరువులో వేయటం వలన చెరువు లో నీరు కలుషితమై పశువులు నీరు తాగడం లేదు వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పూనాల శ్రీనివాస్, పాలకొల్లు. తన అత్తయ్య మస్కట్ దేశమునకు పని కొరకు వెళ్లి ఉన్నారు మూడు నెలలుగా అనారోగ్యం కారణంగా ఆమె చాలా ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి తీసుకురావడానికి డబ్బు అవుతుందని ఏజెంట్ చెప్పగా 1.50 లక్షలు రూపాయలు డబ్బులు ఏజెంట్ కు ఇచ్చి ఉన్నాము ఆ డబ్బును తన వాడుకుని మా అత్తయ్య ను తీసుకురావడానికి మాయ మాటలు చెబుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని మా అత్తయ్యను మస్కట్ నుండి ఇండియాకు తీసుకురావాలని ఫిర్యాదులో కోరారు.

# చనిపోయిన వ్యక్తికి రుణం మంజూరు

**పెదవేగి,మెజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదవేగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో చనిపోయిన వ్యక్తి తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి( పెద్ద రాముడు )పేరున 2020,2021, 2022 సంవత్సరాల్లో రుణము మంజూరు, రుణ చెల్లింపులు, తిరిగి మళ్లీ రుణ మంజూరుల విషయంలో రికార్డులను తారుమారు చేసి నిధులు కాజేసిన పెదవేగి పిఎసిఎస్ కార్యదర్శి తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి (చిన్నరాముడు )మరియు అతని కి సహకరించిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోకుండా కాలక్షేపం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని దెందులూరు మండలం గాలాయగూడెంకు చెందిన తిప్పాభట్ల సత్యనారాయణ జిల్లా కలెక్టర్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. తన తండ్రి ఫిబ్రవరి 2020 తారీఖున చనిపోతే ఆ తర్వాత మూడు సంవత్సరాలు పెదవేగి పిఎసిఎస్ లో రుణం మంజూరు చేసినట్లు రికార్డులు తయారుచేసి నిధులు గోల్మాల్ చేశారన్నారు. ఈ విషయంపై అప్పట్లో ఫిర్యాదు చేయగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కోపరేటివ్ అధికారి, డివిజన్ కో–ఆపరేటివ్ అధికారి జి వెంకటేశ్వరరావు విచారణ చేశారు. ఆ విచారణ ను పక్కదారి పట్టించిన వెంకటేశ్వరరావు వేర్వేరు నివేదికలతో విచారణను తొక్కి పెట్టారు. తర్వాత విచారణ అధికారిగా నియమించబడ్డ కే.నరసింహమూర్తి, అసిస్టెంట్ రిజిస్టర్ కూడా అప్పటి కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి (చిన్న రాముడు) కు సపోర్ట్ చేసి నివేదికను సక్రమంగా తయారు చేయలేదు. జిల్లా కలెక్టర్ క్రిమినల్ కేసు పెట్టాలని ఆదేశించినప్పటికీ విచారణ అధికారులు నివేదిక సరిగా ఇవ్వకుండా కాలక్షేపం చేస్తూ క్రిమినల్ కేసు పెట్టారు. అప్పటి వైఎస్ఆర్సిపి నాయకుల మద్దతుతో జిల్లా కోపరేటివ్ అధికారి, డివిజనల్ కోపరేట్ అధికారి జి. వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్టర్ కే.నరసింహమూర్తి లు పెదవేగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పాలకవర్గాన్ని రద్దు చేయకుండా కొనసాగించడంతోపాటు, తప్పు చేసిన అధికారులు, సిబ్బందికి కూడా మద్దతు పలికారు. క్రిమినల్ కేసు విషయంలో కూడా తదుపరి చర్యలు తీసుకోకుండా కాలక్షేపంచేశారు. విచారణ అధికారులు విచారణ నివేదికలను తప్పుదారి పట్టించడం పై జిల్లా కలెక్టర్ కు సోమవారం టి. సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. తప్పు చేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి మరియు సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అధికారుల పాత్ర ఉందని పేర్కొన్నారు. విచారణ నివేదికలను కూడా తప్పుదారి పట్టించిన జి. వెంకటేశ్వరరావు, కే. నరసింహమూర్తి పై మరియు వీరికి మద్దతు పలికిన జిల్లా కోఆపరేటివ్అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను తిప్పాభట్ల సత్యనారాయణ ఈరోజు కోరారు. పెదవేగి పిఎసిఎస్ స్కాంకు సహకరించిన సిబ్బంది, అధికారులు తీరును, వైఎస్ఆర్సిపి నాయకుల అండదండలతో అధికారుల వ్యవహరించిన తీరును ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్తామని పేర్కొన్నారు,

## బత్తుల వెంకటేశ్వరరావు మృతి సీపీఐకి తీరని లోటు



ఏలూరు,మేజర్ న్యూస్: సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతి సిపిఐకి, వ్యవసాయ కార్మిక సంఘానికి తీరని లోటని సిపిఐ ఏలూరు జిల్లా సమితి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశాయి. బత్తుల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో విజయవాడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సంతాపం తెలుపుతూ సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేసేవారని తెలిపారు.

నాలుగు సంవత్సరాల జైలు జీవితం గడిపినా మొక్కవోని సంకల్పంతో పార్టీ ఉద్యమాలలో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు పాత్ర సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమశంకర్,పుప్పాల కన్నబాబు,బాడిస రాము,సన్నేపల్లి సాయిబాబా, కారం దారయ్య,మైసాక్షి వెంకటాచారి,కంచర్ల గురవయ్య, జేవి రమణ రాజు, జమ్మి శ్రీనివాసరావు, కొండేటి బేబీ, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల,మన్నవ యామిని బత్తుల వెంకటేశ్వరరావు మృతి పట్ల సంతాపం తెలిపారు.

## పెదవేగి తహసీల్దారుగా సుందర్ సింగ్



**పెదవేగి,మేజర్ న్యూస్ :** పెదవేగి తహసీల్దారుగా జి . స ం ం ద ర్సి ం గ్ ్న నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వీ ఉత్తర్వులు జారీ చేశారు. సుందర్సింగ్ రెండేళ్ళకిందట పెదవేగి తహసీల్దారు పనిచేశారు. అనంతరం బదిలీపై వెళ్ళిన ఆయనను ఎన్నికల అనంతరం తిరిగి పెదవేగి తహసీల్దారు నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. సుందర్సింగ్ బుధవారం విధుల్లో చేరతారని రెవెన్యూ అధికారులు తెలిపారు